వలేకర్లు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో
అది తక్కువ సమయంలో ప్రజాదరణ పొందుతున్న
మన ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో
అనుభవం, ఆసక్తిగల విలేకర్లు కావలెను
ఎటువంటి టార్గెట్లు లేవు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్
నియోజకవర్గ ఆర్.సి
మండల రిపోర్టర్
సంప్రదించండి : 9030320743



తెలుగు దినపత్రిక

# మన ప్రజాశక్తి

ప్రజాగళమే.. మా కలం

www. ManaPrajasakti.com

తెలంగాణ\ ఆంధ్రప్రదేశ్






నల్గొండ | సోమవారం | 1-6-2026 | ఎడిటర్: మెరుగు. భరత్ కుమార్ | సంపుటి: 1 | సంచిక:213 | పేజీలు: 8 | వెల: రూ.4/-


## చల్లని కబురు

**మరో పది రోజుల్లో తెలంగాణకు నైరుతి రుతుపవనాలు!**



**హైదరాబాద్,మే31**
భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుపై

# సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న ఎంప్లాయీస్? హెల్త్ స్కీమ్
- ఎంప్లాయి హెల్త్ కేర్? ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలు
- ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులు
- ఈ పథకం అమలుకు అవసరమైన వివరాల సేకరణ
- వివరాలను సేకరించేందుకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే అన్ని శాఖలకు సర్క్యులర్? జారీ
- క్యాష్‌లెస్ చికిత్స సేవలు అందించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మే31**
తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న ఎంప్లాయీస్? హెల్త్ స్కీమ్? అమలుపై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఎంప్లాయి హెల్త్ కేర్? ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలు కానుంది. ఈ పథకానికి సంబంధించి ~~ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు,~~ పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ఈ ట్రస్టుకు సీఈవోగా నియమిస్తారు. ఈ పథకం అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే అన్ని శాఖలకు సర్క్యులర్? జారీ చేసినట్లు సమాచారం. మే 31వ తేదీలోపు డేటా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ వివరాల ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ చికిత్స సేవలు అందించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని అధికారులు వెల్లడించారు. ఇవాళ సాయంత్రం లోపు డేటా అప్ లోడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.



### విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా

# రైల్వే జోన్ ప్రారంభం

- ఇది చారిత్రాత్మక మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- దశాబ్దాల కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ జోన్ కీలకం కానుందని వెల్లడి

**అమరావతి,మే31,**
విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపు (జూన్ 1న) అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు.

### బద్రీనాథ్ యాత్రకు

# మహా రద్దీ

**30 కి.మీ. ట్రాఫిక్ జామ్‌తో యాత్రికుల నరకయాతన!**



**ఇంటర్నెట్ డెస్క్,మే31**
పవిత్ర చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తడంతో బద్రీనాథ్ వెళ్లే మార్గంలో తీవ్రమైన ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో జోషీమఠ్ సమీపంలో దాదాపు 30 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వేలాది మంది యాత్రికులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయి



### నంద్యాలలో

# వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం

**ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక**

నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు.



### కర్ణాటకలో

# ఘోర రోడ్డు ప్రమాదం

**ఆరుగురు కూలీల దుర్మరణం**

**ఇంటర్నెట్ డెస్క్,మే31**
కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి పట్టణం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి.


సంతాపవార్త



స్వస్తిశ్రీ పరాభవ నామ సం॥ర అధిక జ్యేష్ఠ మాస శు॥ షష్ఠి
ది. 22-05-2026 శుక్రవారం ఉ॥ గం॥ 5-40 ని॥లకు
మా తండ్రి గారైన
శ్రీ దేశబోయిన వెంకట్రాములు గారు
స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతించుచున్నాము.
ది. 01-06-2026 సోమవారం పెద్దకర్మ ఆశీర్వచనం, మాసికం
మా స్వగృహము నందు జరుగును. కావున తామంతా విచ్చేసి
మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.

ఇష్టబంతి :
మ॥ గం॥ 1-00 లకు
శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్
లక్ష్మీదేవిగూడెం క్రాస్ రోడ్,
మం॥ వేములపల్లి, జి॥ నల్లగొండ.

ఇట్లు
కుటుంబ సభ్యులు
మరియు బంధువులు, మిత్రులు
గ్రా॥ ఆమనగల్లు,
మం॥ వేములపల్లి, జి॥ నల్లగొండ.
సెల్ : 9703666566

Sri Durga, srpt@9440576618


# పంజాబ్ కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం..

**పంజాబ్ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాజయం**

**ఇంటర్నెట్ డెస్క్,మే31**
పంజాబ్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు మరోసారి భగ్గుమన్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలవడంతో సీనియర్ నేతల మధ్య వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేయాల్సిన తరుణంలో, స్థానిక ఫలితాలు పార్టీలో





### విశాఖ ఐటీఐ క్లస్టర్‌కు

# కేంద్రం ఆమోదం

- పీఎం సేతు పథకం అమలులో ఏపీ ఫస్ట్..
- పీఎం సేతు పథకం అమలులో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్
- విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం
- ఆర్సెలర్ మిట్టల్, నామ్‌టెక్ భాగస్వామ్యంతో ఐటీఐల ఆధునికీకరణ
- పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యం



**అమరావతి,మే31**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం-సేతు) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ పథకం కింద విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు (సాఫ్రా) కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పీఎం-సేతు కింద ఆమోదం పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ప్రముఖ ఉక్కు తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా ఇండియా), న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ఈ

### మంత్రాలయం వద్ద

# విషాదం

- మృతుల్లో ఐదేళ్ల బాలుడు, హైదరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు
- సత్యనారాయణ వ్రతం తర్వాత స్నానానికి వెళ్లి ప్రమాదం
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు



**కర్నూలు,మే31**
కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక www.ManaPrajasakti.com తెలంగాణ ఆంధ్రప్రదేశ్

# అక్రమ మద్యం పట్టివేత





**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

నందికొట్కూరు నియోజకవర్గం లోని పగిడ్యాల మండలం బీరవోలు గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వెంకటేశ్వర గౌడ్ వద్ద 25 ఆఫీసర్ ఛాయిస్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరేంద్ర ఆదివారం తెలిపారు.జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బీరువాలు గ్రామంలో కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన ఐదు మోటర్ సైకిల్ యజమానులకు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ నేరాలు బాల్య వివాహాలు మహిళల రక్షణ హక్కులు శక్తి యాప్ హెల్మెట్ ధరించడం వాటి ప్రాముఖ్యతను గురించి తెలియజేశామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 7993485111కు కాల్ చేయండి : సి.ఐ






**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

ప్రజలు అత్యవసర సమయాల్లో తన ఫోన్ నెంబర్కు ఫోన్ చేయాలని నందికొట్కూరు సి.ఐ అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లెల గ్రామంలో ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు మహిళలు ఎలాంటి ఇబ్బందులు కలిగిన శక్తి యాప్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. చట్టాల వల్ల కలిగే రచనల గురించి తెలుపుతూ సమాజంలో వివరణ మీతో అసభ్యంగా లేదా దృష్టిగా ప్రవర్తించినప్పుడు మీరు పోలీసు వారికి తెలియపరిస్తే మీకు పోలీసు వారు రక్షణగా ఉంటారని ఆపద సమయంలో112,100 కాల్ చేయవచ్చు అన్నారు. అనంతరం ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ..ఈ సమావేశానికి హాజరుకాని వారికి కూడా ఈ విషయాలను పూర్తిగా తెలియజేయండి అని ప్రజలకు తెలియజేశారు ప్రతి ఒక్కరు చట్టాల గురించి తెలుసుకుని ఎవరు కూడా ఇలాంటి ఘర్షణలకు పోకుండా చూసుకోవాలన్నారు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఉప్పల్, మే 31, మన ప్రజాశక్తి :**





శ్రీ విరాట్ విశ్వకర్మ స్వర్ణకార సంఘం, రామంతాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు విరజ్బాంద్రస్వామి దేవస్థానము, శ్రీనివాసపురం, రామంతాపూర్ లో బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. స్వర్ణకారుల సంక్షేమం, వారి వృత్తి అభివృద్ధి, సామాజిక ఐక్యత కోసం సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.సంఘం సభ్యుల ఐక్యతతో సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజా సేవలో భాగంగా ప్రతి వర్గం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు, స్వర్ణకార సంఘ ప్రతినిధులు, భక్తులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ కాలువ బ్రిడ్జి ప్రహరీ గోడ

# పునర్నిర్మాణం తక్షణమే చేపట్టాలి : సిపిఐ

**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్ర 7వ రోజు ఆదివారం కొనసాగింది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.రఘురామ మూర్తి నాయకత్వంలో పట్టణం లోని స్థానిక చౌడేశ్వరి ఆలయం సమీపంలోని సర్కిల్ వద్ద ఉన్న డ్రైనేజీ కాలువ బ్రిడ్జిని పరిశీలించారు.బ్రిడ్జి వద్ద ఉన్న ప్రహరీ గోడ కూలిపోయి మూడు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు పునర్నిర్మాణం చేపట్టకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రాలు అందజేసినప్పటికీ, రెండు సంవత్సరాలు గడిచినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ఈ బ్రిడ్జి కేజీ రహదారి పక్కనే ఉండటంతో పాటు కళాశాల, ఆర్టీసీ బస్టాండ్కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉండటంతో నిత్యం విద్యార్థులు, ప్రయాణికులు, వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ప్రజలు ప్రమాదభయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అంతేకాకుండా కాలువలో చెత్త పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.అందువల్ల వెంటనే ప్రహరీ గోడ పునర్నిర్మాణం చేపట్టి, కాలువను శుభ్రపరచి ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, సుంకన్న,స్వాములు, మహేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం..ప్రాణాలతో చెలగాటం.

**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతు ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఆటోనగర్ ప్రాంతంలో పర్యటించడం జరిగింది. నూరా మసీద్ ముందు లైను బజాజ్ షోరూం వెనుక భాగాలలో వేలాడుతున్న విద్యుత్ తీగలను ట్రాన్స్ఫార్మర్ నుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదకు నిలయాలుగా ఉన్న వాటిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నందికొట్కూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పటికీ వైర్లు 20 సంవత్సరాలుగా పట్టణంలో మార్పు చెందడంతో గతంలో వేసిన విద్యుత్తు గల తోనే విద్యుత్ సరఫరా చేయడం వల్ల పాత వాటి వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో వేసిన పోల్స్ వల్ల ప్రమాదాలకు నిలయంగా మారాయని తెలిపారు స్థానికులు అనేక పర్యాయాలు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న పరిష్కారం కావడం లేదన్నారు వర్షాకాలంలో డీప్ నుంచి ఉన్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందన్నారు ఈ మధ్యకాలంలో ఓ ప్రైవేటు వెల్ఫేర్ విద్యుత్ స్తంభం పైనుంచి పడి తృటిలో తప్పించుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. పట్టణంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరుతున్నట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ చిన్న సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపను పోవడం లేదని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను మార్చకపోతే ప్రజలను పోగు చేసుకుని సిపిఐ ఎంఎల్ డిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు నరసింహులు వేల్పుల ఏసన్న,మహిళా సంఘం జిల్లా నాయకురాలు శిరీష,యువజన సంఘం నాయకులు గణేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం








**20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరిన విద్యార్థిని, విద్యార్థులు**

**మన ప్రజాశక్తి ఆలేరు మండలం మే 31.2026**

గత కాలపు తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ,చదువుకున్న పాఠశాలను, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించుకుంటూ శ్రీ రామకృష్ణ విద్యాలయం 2005--2006 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక దినేష్ గార్డెన్స్లో ఘనంగా నిర్వహించారు."ఆనాటి జ్ఞాపకాలు -- మధుర స్మృతులు 2026" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థుల కలయికతో సందడిగా మారింది.ఈకార్యక్రమం వందేమాతరం గీతంతో ప్రారంభమై,జ్యోతి ప్రజ్వలన అనంతరం దివంగత బీమాగాని దివ్యభారతీ,బర్ల సంపత్లకు నివాళులర్పించారు.ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రాజుల శంకర్,సీనియర్ ఉపాధ్యాయురాలు గుగ్గిళ్ల జయమ్మ,బోడిగం వెంకట్ రెడ్డి,బూడిద దీపక్,అల్వాల ప్రసాద్,పోతుగంటి సంపత్కుమార్,చింతకింది కృష్ణ,అలె ప్రభ,గుడికుంట్ల యాకుబ్, గడసంతల భాస్కర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి,వారి ఆశీస్సులు పొందారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రాజుల శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమ పాఠశాలను,గురువులను గుర్తుంచుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు.ఇలాంటి సమ్మేళనాలు పాత స్నేహాలను మరింత బలోపేతం చేయడంతో పాటు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ రెండు దశాబ్దాల తర్వాత కూడా విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకోవడం, పాఠశాల పట్ల ప్రేమాభిమానాలు కొనసాగించడం అభినందనీయమని తెలిపారు. గురు-శిష్య బంధం కాలంతో పాటు మరింత బలపడుతుందని అన్నారు.సుమారు 20 ఏళ్ల క్రితం పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడి,మళ్లీ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో భావోద్వేగభరిత వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ,తమ విద్యార్థి దశలో జరిగిన అనుభవాలను పంచుకున్నారు.ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 2005--2006 బ్యాచ్కు చెందిన అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల మధ్య స్నేహబంధాలు, గురువుల పట్ల గౌరవం,పాఠశాలపై ఉన్న అనుబంధం మరోసారి ప్రతిఫలించిన ఈ ఆత్మీయ సమ్మేళనం అందరికీ చిరస్మరణీయంగా నిలిచింది.

# ఉప్పల్ మినీ శిల్పారామం లో కూచిపూడి నృత్య ప్రదర్శన







**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,ఉప్పల్, మే31, మన ప్రజాశక్తి :**

ఉప్పల్ మినీ శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గురువు మేఘన శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. వినాయక కౌతం, జాలరులు కురియగా, జతిస్వరం, ఝుమ్ ఝుమ్ తనన, నాటేర్ష కౌతం , రామదాసు కీర్తన, నీలమేఘ శరీర, అన్నమాచార్య కీర్తన మొదలైన అంశాలను కళాకారులూ శ్రీనిధి, అక్షర, మీనాక్షి, భావిక, వరుణ్య తదితరులు పాల్గొన్నారు

# బూత్ లెవెల్ లో పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఉప్పల్, మే 31, మన ప్రజాశక్తి :**

చర్లపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నేమూరీ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో సిరీ ఫంక్షన్ హాల్ చక్రి పురంలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ అలాగే బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ బూత్ లెవల్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.పార్టీ సభ్యత్వ నమోదు



కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను



మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ వినాయక్ నగర్‌లో రూ.60 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు



## పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఉప్పల్, మే 31, మన ప్రజాశక్తి :**

ఉప్పల్ డివిజన్ వినాయక్ నగర్‌లో రూ.60 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆదివారం



మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఇటీవల కాలనీల్లో పర్యటించిన సందర్భం గా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం పనులు శరవేగం గా మొత్తం రూ.60 లక్షలతో డ్రైనేజీ, నిర్మాణం పనులు జరుగుతున్నాయి

రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "కాలనీవాసుల తో కలిసి పనులను పరిశీలించాం. వర్షాకాలం లోపు డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నాం త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం వినాయక్ నగర్ ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతాం" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ సల్ల ప్రభాకర్ రెడ్డి, అలుగుల అనీల్ కుమార్, తోకట రాజు

కంచర్ల శ్రీను, నాగరాజు కుందానపల్లి బాలరాజు కుందానపల్లి రాజు సింగారం వెంకటేష్, కుందానపల్లి భాగ్య, సింగారం అండాలు మామిళ్ళ పుష్ప, మామిళ్ళ మధు, కుందానపల్లి నరేందర్, యాకరి శ్రీను తదితరులు పాల్గొన్నారు

# అను ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,ఉప్పల్, మే 31,మన ప్రజాశక్తి :**

ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలను అందించాలనే లక్ష్యంతో వెంకట్ రెడ్డి ఈసీఐఎల్ వద్ద ఏర్పాటు చేసిన "అను ఫుడ్ కోర్ట్" ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించి యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తో పాటు ప్రజలకు పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారం అందించే ఇలాంటి సంస్థలు



మరిన్ని రావాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో అడుగు పెడుతున్న యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు.అను ఫుడ్ కోర్ట్‌లో వెజ్ నాన్-వెజ్ వంటకాలతో పాటు టిఫిన్స్, మీల్స్,



బిర్యానీ, చైనీస్ తదితర రుచికరమైన వంటకాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా డివిజన్‌లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఉప్పల్, మే 31, మన ప్రజాశక్తి :**

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాప్రా, వంపుగూడ డివిజన్‌లో సుమారు రూ.4 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు: సీనియర్ సిటిజన్ కాలనీ ఖ+ణ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు



రూ.40 లక్షలుసాకేత్ కాలనీలో ఓపెన్ జిమ్ చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు,రూ.25 లక్షలువోర్లా ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు,రూ.60 లక్షలుకాప్రా నాలా నుండి సాయి సుమా టీ-జంక్షన్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు రూ.2.50 కోట్లుగాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు,రూ.20 లక్షలుమొత్తంగా సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ



అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కాప్రా డివిజన్‌లో మౌలిక వసతులు మరింత మెరుగుపడి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బైరి నవీన్ గౌడ్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విధివిధానాలు లేకుండానే ఈహెచ్ఎస్ కోతలు!

## ఆర్థిక శాఖ తీరుపై యూటీఎఫ్ ఆగ్రహం

## 1.5% మినహాయింపులు నిలిపివేయాలని డిమాండ్

**నల్లగొండ,మే 31( మన ప్రజాశక్తి ) :**

ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు కాకముందే మే నెల వేతనాల్లో 1.5 శాతం చందా మినహాయించడం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) నల్లగొండ జిల్లా కమిటీ విమర్శించింది. ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో వ్యవహరిస్తోందని జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈహెచ్ఎస్‌కు సంబంధించి ఆసుపత్రులతో ఒప్పందాలు పూర్తికాలేదని, చికిత్స ప్యాకేజీ రేట్లు నిర్ణయించలేదని, డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయలేదని తెలిపారు. చందా మినహాయింపుపై ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) కూడా వెలువడలేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధించడం సమంజసం కాదన్నారు.ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల వివరాల నమోదుకు గడువు విధించినప్పటికీ ఐఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో చివరి వరకు మార్పులు కొనసాగాయని, పూర్తి సమాచారం సేకరణ కూడా జరగలేదని ఆరోపించారు. పాత నిబంధనల ప్రకారం భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఒకరి నుంచే చందా వసూలు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఇద్దరి వేతనాల నుంచి కోత విధించారని తెలిపారు. ఈ నెలాఖరులో పదవీ విరమణ పొందే ఉద్యోగుల నుంచి కూడా చందా మినహాయించడం ఆశ్చర్యకరమన్నారు.ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులు కూడా కొంత భారం భరించేందుకు సంఘాలు అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే పథకంపై ఉన్న సందేహాలను నివృత్తి చేయకుండా ముందస్తుగా చందా కోతలు విధించడం ఉద్యోగుల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకుని వేతనాల్లో ఈహెచ్ఎస్ చందా మినహాయింపులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ ఏకపక్ష నిర్ణయాల వల్ల ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య దూరం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# రాపిడో, ఓలా సేవలను నల్లగొండలో నిషేధించాలి

## ఆటో డ్రైవర్ల ఐక్య సమావేశంలో తీర్మానం

**నల్లగొండ,మే 31 (మన ప్రజాశక్తి ):**







పెరుగుతున్న డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలతో ఇప్పటికే ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి తోడు రాపిడో, ఓలా వంటి కార్పొరేట్ సంస్థల సేవల వల్ల ఆటో కార్మికుల జీవనోపాధికి తీవ్ర నష్టం జరుగుతోందని నల్లగొండ పట్టణ ఆటో డ్రైవర్లు, యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు.ఆదివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో వివిధ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. రాపిడో, ఓలా వంటి సేవలను నల్లగొండ పట్టణ పరిధిలో తక్షణమే నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఆర్టీవో, సంబంధిత మంత్రి వారికి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో బీఆర్‌టీయూ, టీఏటీయూ తదితర ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు కలగోని యాదగిరి గౌడ్, రైల్వే స్టేషన్ అధ్యక్షుడు యాదయ్య, బస్టాండ్ అధ్యక్షుడు లింగరాజు, అసలం, పానగల్ అధ్యక్షుడు బొంత రోశయ్య, మహేశ్వరి బస్టాండ్ బయట అధ్యక్షుడు దశరథ్, చౌరస్తా బాబాయ్, మతీన్, క్లాక్‌టవర్ శంకర్, రాంబాబు, చోటు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# వేసవి శిక్షణా శిబిరం -2026 ముగింపు వేడుకలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఉప్పల్, మే 31, మన ప్రజాశక్తి :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ( ఎం ఎం సి ) పరిధిలోని ఉప్పల్ జోన్ వారి వేసవి శిక్షణా శిబిరం ( ఎస్ సి సి ) 2026 -- ముగింపు వేడుక, ఆదివారం ఉదయం 8:00 గంటలకు ఉప్పల్ మున్సిపల్ మైదానంలో విజయవంతంగా నిర్వహించబడింది. వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు క్రమశిక్షణ, ఉత్సాహం క్రీడాస్ఫూర్తి ని ప్రదర్శిస్తూ చేసిన మార్చ్ పాస్ట్‌తో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి పలువురు విశిష్ట అతిథులు అధికారులు హాజరై కార్యక్రమాన్ని అలంకరించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఈటల రాజేందర్, పార్లమెంటు సభ్యులు, మల్కాజిగిరి నియోజకవర్గం బేతి సుభాస్ రెడ్డి ఉప్పల్ మాజీ శాసనసభ్యులు రాధిక గుప్తా, ఐఏఎస్ , జోనల్ కమిషనర్, ఉప్పల్ జోన్, ఎం ఎం సి హరి కృష్ణ



సూపరింటెండింగ్ ఇంజనీర్, ఉప్పల్ జోన్ ఎంఎంసి శైలజ, డిప్యూటీ కమిషనర్, బోడుప్పల్ ఌ ఉప్పల్ వేనల్ గౌడ్ డీఈఈ, ఉప్పల్ సర్కిల్ బి, యం విఘ్నేష్ యాదవ్ ఇంచార్జ్ గేమ్స్ ఇన్స్ట్రక్టర్, ఉప్పల్ మండలంరాజ్‌కుమార్ ఏఈ, ఉప్పల్ సర్కిల్,చ. యోగిత, ఐ/సి గేమ్స్ ఇన్‌స్పెక్టర్, కాప్రా ఌ నాచారంవినయ్, ఐ/సి గేమ్స్ ఇన్‌స్పెక్టర్, ఘట్‌కేసర్ ఈ శిబిరం నిర్వహణలో కీలక పాత్ర పోషించిన క్రీడా సిబ్బంది సభ్యులు అనిల్, కె. మహేష్, ఎం. మహేష్,




రమేష్, గణేష్, అనిల్ రెడ్డిలతో పాటు కోచ్‌లందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ వేడుకలో, సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026లో విజయవంతంగా పాల్గొన్న విద్యార్థులందరికీ భాగస్వామ్య ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఇంటర్-సెంటర్ టోర్నమెంట్లలో రాణించిన విద్యార్థులకు వారి అత్యుత్తమ ప్రదర్శనలకు గుర్తింపుగా మెరిట్ సర్టిఫికేట్లు పతకాలను ప్రదానం చేశారు. శిబిరం విజయవంతంగా నిర్వహించడానికి అంకితభావంతో సేవ చేసిన సహకరించిన కోచ్‌లను




కూడా ధృవపత్రాలతో సత్కరించారు.సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026ను ఘనవిజయంగా మార్చడంలో క్రీడా విభాగం, కోచ్‌లు,సిబ్బంది విద్యార్థులు చేసిన కృషిని ప్రముఖులు అభినందించారు. యువ క్రీడాకారులు క్రీడలలో తమ భాగస్వామ్యాన్ని కొనసాగించాలని వారి వారి క్రీడాంశాలలో రాణించడానికి కృషి చేయాలని వారు ప్రోత్సహించారు.సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026 విజయవంతంగా ముగిసిన సందర్భంగా ధన్యవాదాల సమర్పణ జాతీయ గీతాలతో కార్యక్రమం ముగిసింది.



# జీవించే హక్కుకు విఘాతం!




నేరం రుజువయ్యేవరకు ప్రతి నిందితుడూ నిర్దోషే అన్నది సహజ న్యాయసూత్రం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నిర్దేశం ప్రకారం... ప్రతి పౌరుడికీ జీవించే హక్కు ఉంది. దానిని అకారణంగా కానీ, ఏ కారణంగానైనా కానీ నిర్దాక్షిణ్యంగా హరించడం న్యాయసూత్రాలకు విరుద్ధం. కానీ, దేశంలో వివిధ కేసుల్లో 5 లక్షల 30 వేల మందికి పైగా జైళ్లలో ఉంటే, అందులో 75 శాతం మంది నేరం రుజువు కాకుండానే అప్రకటిత కారాగార శిక్ష అనుభవించాల్సి రావడం విచారకరం. విచారణలో తీవ్రమైన జాప్యం, న్యాయాన్ని పొందలేని నిందితుల కుటుంబ నేపథ్యం, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పాలకుల నిరంకుశ, ప్రతీకార భావన- అనేకమంది ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకూ, సహజ న్యాయసూత్రాలకూ తీవ్రమైన విఘాతం కలిగిస్తోంది.

2020 ఢిల్లీ అల్లర్ల కేసులో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు ఉమర్ ఖలీద్‌ను ఉపా చట్టం కింద అరెస్టు చేసి ఐదేళ్లు దాటుతోంది. ఇంతవరకూ విచారణ ప్రారంభం కాలేదు. ఛార్జిషీట్ దాఖలు ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది. మధ్యలో బెయిల్ కోసం అనేకసార్లు ప్రయత్నించినా కోర్టులు నిరాకరిస్తున్నాయి. 'భారీ కుట్ర' అంటూ దర్యాప్తు సంస్థలు బనాయించిన ఆరోపణలనే ప్రాథమిక ఆధారంగా పరిగణించి, బెయిల్ ఇవ్వటానికి నిరాకరించడం రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తోంది. ఏళ్ల తరబడిన నిర్బంధం తరువాత నిందితులపై నేరం రుజువు కాకపోతే- వారు కోల్పోయిన జీవితాన్ని ఎలా తిరిగి ఇస్తారన్న ప్రశ్న కూడా చాలా విలువైనది. బ్రిటీషు పాలకులు భారత పౌరులపై ప్రయోగించిన నిర్బంధ, నిరంకుశ చట్టాలకు గంపగుత్త రూపం ఉపా. ఈ చట్టంలోని సెక్షన్ 43డి (5) ప్రకారం- దర్యాప్తు సంస్థ చూపించిన ప్రారంభ ఆధారాలనే నిజమన్నట్టు కోర్టులు భావించి, నిందితులకు బెయిల్ ఇవ్వకూడదనేది అత్యంత కఠినమైన నిబంధన. పూర్తి విచారణ జరపకుండానే ఎన్నేళ్లయినా జైలులో బంధించడం పట్ల అనేకమంది న్యాయనిపుణులు, ప్రజాస్వామ్యవాదులు మొదటినుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. మత ప్రాతిపదికన పౌరసత్వ చట్ట సవరణ తీసుకురావటాన్ని దేశంలో అనేకమంది వ్యతిరేకించగా, ఉమర్ ఖలీద్ వంటి వారూ నిరసన ఉద్యమంలో పాల్గొన్నారు. అది రాజ్యాంగబద్ధమైన హక్కు. అదెలా భారీ కుట్ర, దేశద్రోహమూ అయిందో దర్యాప్తు సంస్థలు ఇంతవరకూ ఒక్క రుజువూ చూపలేదు. అయినప్పటికీ పదేపదే బెయిల్ నిరాకరణ కొనసాగుతోంది.

ఉపా లాంటి కేసుల్లో సైతం నిందితులను ఏళ్ల తరబడి నిర్బంధించడం సరైంది కాదని, అక్కడ కూడా బెయిల్ పొందటాన్ని హక్కుగా భావించాల్సి ఉంటుందని ఐదు రోజుల క్రితం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న వ్యాఖ్యానించడం- ఈ అంశానికి ఉన్న ప్రాధాన్యాన్ని ముందుకు తెస్తోంది. 2019 -- 2023 మధ్య ఉపా చట్టం కింద 10,440 మందిని అరెస్టు చేసి జైళ్లలో ఉంచితే, ఇంతవరకూ విచారించి దోషులుగా తేల్చింది కేవలం 335 మందినే! మిగతా వారంతా కేవలం ఆరోపణలతోనే కారాగారాల్లో మగ్గుతున్నారు. ఇందులో మోడీ--అమిత్ షా హయాంలోని బిజెపి ప్రభుత్వం దురుద్దేశపూరితంగా బనాయించిన కేసులే ఎక్కువన్నది బహిరంగ రహస్యం. మోడీ రాజకీయ, పాలనాపరమైన విధానాలను ప్రశ్నించటమే దేశద్రోహమన్న తీరులో చట్టాలను దుర్వినియోగం చేయడం, దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు. మానవీయ విలువలకు తలవొంపు.

ఇక సాధారణ కేసుల్లో కూడా లక్షలాది మంది సామాన్యులు విచారణ, బెయిళ్లు లేకుండానే చీకటి జైళ్లలో కునారిల్లిపోతున్నారు. ఇందులో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల వారే అత్యధికంగా ఉండడం గమనార్హం. విశాఖ ఏజెన్సీలోని వందలాది మంది ఆదివాసీలు గంజాయి కేసుల్లో ఇరికించబడి, విచారణ లేకుండానే కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. న్యాయసహాయం అందకపోవడం, పెద్దఎత్తున ధనరూపంలో పూచీకత్తులు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడం వారి విలువైన జీవితాన్ని జైలు గోడలకే పరిమితం చేస్తోంది. రాజ్యాంగ సూత్రాలూ, న్యాయ సుభాషితాలూ మాటలకే పరిమితం కావడం వల్ల ప్రయోజనం లేదు. పాలకుల కక్షకు, రాజకీయ దురుద్దేశాలకూ చట్టాలూ, న్యాయవ్యవస్థ ఉపకరణాలు కాకూడదు. అందుకే న్యాయవ్యవస్థ పౌరుల రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడే నిబద్ధతతో వ్యవహరించాలి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నట్టు -- "రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దాన్ని అమలు చేసే మనుషుల మీదే దాని జయాపజయాలు ఆధారపడి ఉంటాయి."

# లోపభూయిష్టం 'సర్'




దేశంలో వివాదాస్పదమై ఇంకా సుప్రీం కోర్టు ముందున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మరో 16 రాష్ట్రాల్లో, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపడతామన్న భారత ఎన్నికల సంఘం ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. ఎస్ ఐ ఆర్ మూలంగా పశ్చిమ బెంగాల్ లో 90 లక్షల మంది ఓట్లు తొలగించారు. ఆ రాష్ట్ర ఎన్నికలపై ఎస్ ఐ ఆర్ ప్రభావం మెండుగా ఉందని లోకం కోడై కూసింది. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జరిగిన 105 సీట్లలో బిజెపి గెలవగా వాటిలో 35 సీట్లలో ఎస్ ఐ ఆర్ తొలగించిన ఓట్ల కన్నా తక్కువ మార్జిన్ తో బిజెపి గెలిచింది. ఇప్పుడా సీట్లలో ఓడిన అభ్యర్థులు కోర్టులో కేసులు దాఖలు చేస్తున్నారని వార్తలొస్తున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాల్లో ఎస్ ఐ ఆర్ ను కారణంగా చూపితే ఆ కేసుల్ని విచారిస్తామని గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తే ప్రకటించియున్నారు కూడా! ఎస్ ఐ ఆర్ అమలులో లోపాలున్నాయన్న విషయం బహిరంగ రహస్యం. సాక్షాత్తు సుప్రీంకోర్టు బెంగాల్ లో ఎస్ ఐ ఆర్ ట్రిబ్యునళ్లకు విచారణాధికారులుగా న్యాయాధికారులను నియమించింది. అంతకు ముందు ఎస్ ఐ ఆర్ అమలు చేసిన బీహార్, తమిళనాడు, కేరళం తదితర రాష్ట్రాల్లోనూ అక్రమాలు జరిగాయి. అటువంటి ఎస్ ఐ ఆర్ ను ఇప్పుడు మూడవ దశ పేరిట అమలుకు పూనుకోవడం దారుణం. అంతేగాక బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ఎంతో లోపభూయిష్టంగా జరిగిందన్నది నగ్న సత్యం. ఆ రాష్ట్ర సి ఈ ఓ గా పని చేసిన పెద్దమనిషి బిజెపి అధికారానికి వచ్చాక అమాంతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కావడం అందుకో తార్కాణం. అసలు ఈ ఎస్ ఐ ఆర్ ను ముందుకు తెచ్చిన ప్రస్తుత ఎన్నికల ప్రధాన కమిషనర్ పార్లమెంటులో అభిశంసనను సైతం ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏ విధంగా చూసినా ఎస్ ఐ ఆర్ ఒక వివక్షా పూర్వక ప్రక్రియ.ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైనది. ఎన్నికలకు ప్రాతిపదిక ఓటరు జాబితా. అది లోపరహితంగా ఉంటేనే ఎన్నిక సక్రమం అవుతుంది. అలాగే ఎన్నికల నిర్వాహకులు నిరపేక్షంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కానీ బిజెపి అధికారానికి వచ్చాక మిగతా రాజ్యాంగ వ్యవస్థల మాదిరిగా ఎన్నికల కమిషన్ ను కూడా తమ పరివారంతో నింపేసుకున్నారు. ఆ క్రమంలోనే సిఈసి నియామకం కూడా! అసలు నియామక ప్రక్రియలోనే తిరకాసు ఉంది. గురువారం నాడు జరిగిన విచారణలో సాక్షాత్తూ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యల్లోనూ అది దాగుంది. ప్రధాని అధ్యక్షతన గల ఎంపిక కమిటీలో తటస్థులు ఒక్కరైనా లేరన్న నగ్న సత్యాన్ని ఆయన ప్రస్తావించారు. దానికి సమాధానం ఇవ్వాల్సిన అటార్నీ జనరల్ సుప్రీం కోర్టు మరో పార్లమెంటు ఛాంబర్ కాలేదని అడ్డగోలు వాదనలు చేయడం విస్తుగొలుపుతోంది. మొదటి రెండు రౌండ్లలో తీవ్ర అవకతవకలు జరిగిన ఎస్ ఐ ఆర్ అమలును వెంటనే ఉపసంహరించాలి. ఇప్పటికే పలు ఆరోపణల్లో చిక్కుకొని సుప్రీం కోర్టు ఎదుట కేసు, పార్లమెంటు ముందు అభిశంసన పెండింగ్ లో ఉన్న సి ఈ సి కి మూడవ దశ ఎస్ ఐ ఆర్ ప్రకటించే నైతిక అధికారం కూడా లేదన్న పరిశీలకుల వ్యాఖ్యల్ని ఎవరూ కొట్టి పారెయ్యలేరు. ఇతర రాష్ట్రాలన్నిటి ఎస్ ఐ ఆర్ అమలు అనుభవమూ అవకతవకల మయమే కనుక తెలుగు రాష్ట్రాల్లో దాని అమలును నిలిపివేయాలి. బిజెపి యేతర రాజకీయ పార్టీలు ఈ లోపభూయిష్ట విధానాన్ని ప్రతిఘటించాలి. ప్రజాస్వామ్యానికి మూలమైన ఎన్నికల ప్రక్రియను తొత్తడం చేసే ఎస్ ఐ ఆర్ ను ప్రజలు వ్యతిరేకించాలి. ఆ దిశగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి.

## జిల్లా అంతా నాఖాబందీ:

# అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్లగొండ టౌన్,మే 31(మన ప్రజాశక్తి )**

జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు శనివారం రాత్రి విస్తృత నాఖాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎస్పీ స్వయంగా పాల్గొని పలు ప్రాంతాలను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు.

జిల్లాలోని 47 చెక్‌పోస్టుల వద్ద దాదాపు 1,500 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండతో పాటు ప్రధాన పట్టణాలు, జాతీయ రహదారులు, రద్దీ కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా పెంచారు.

ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు తదితర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, నంబర్‌ప్లేట్లను పరిశీలించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సైలెన్సర్ల మార్పులు, నంబర్‌ప్లేట్లు లేకుండా సంచరించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన 738 వాహనాలపై చర్యలు తీసుకున్నారు.

రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను ప్రశ్నించి వివరాలు నమోదు చేశారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించబోమని ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్‌శాఖ ప్రధాన లక్ష్యమని, నేరాల నియంత్రణలో భాగంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై, రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై వెంటనే సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ అభినందనలు



నల్లగొండ,మే 31 (మన ప్రజాశక్తి ): (టిఎస్ యూటిఎఫ్) రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ఉమ్మడి నల్గొండ జిల్లా సీనియర్ నాయకులు కామ్రేడ్ చిలుకరాజు రాములు గారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపిన (టిఎస్ యూటిఎఫ్) జిల్లా కమిటీ. (టిఎస్ యూటిఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు నేతృత్వంలోని జిల్లా కమిటీ తరఫున రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ఉమ్మడి నల్గొండ జిల్లా సీనియర్ నాయకులు కామ్రేడ్ చిలుకరాజు రాములు గారికి ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా కమిటీ ఆయన సేవలను స్మరించుకుంటూ భవిష్యత్ జీవితంలో ఆరోగ్యం, ఆనందం కలగాలని ఆకాంక్షించింది.

# క్యాన్సర్ చికిత్సలో నిమ్స్ మరో ముందడుగు.. ఖరీదైన పరీక్షలు ఇక ఉచితం

**హైదరాబాద్ నిమ్స్‌లో త్వరలో లిక్విడ్ బయాప్సీ సేవలు ప్రారంభం**

**రక్త నమూనాతోనే క్యాన్సర్ దశ, తీవ్రతను గుర్తించే ఆధునిక పరీక్ష**

**ఇప్పటికే 1443 మందికి ఉచితంగా ఎన్‌జీఎస్ జన్యు పరీక్షలు పూర్తి**

**ఆరోగ్యశ్రీ కింద ఈ ఖరీదైన పరీక్షలన్నీ ఉచితంగా అందించనున్నట్లు వెల్లడి**

**పేద, మధ్యతరగతి రోగులకు ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్యం అందించడమే లక్ష్యం**




హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి, రోగికి ప్రత్యేకమైన చికిత్స అందించే లక్ష్యంతో మరో కీలక ముందడుగు వేసింది. అత్యాధునిక 'లిక్విడ్ బయాప్సీ' పరీక్షలను త్వరలోనే రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రకటించారు. కేవలం రక్త నమూనా ద్వారానే క్యాన్సర్ దశ, దాని తీవ్రతను గుర్తించే ఈ విప్లవాత్మక సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తిగా ఉచితంగా అందించనుండటం క్యాన్సర్ రోగులకు పెను ఊరటనిచ్చే అంశం.సాధారణంగా క్యాన్సర్ నిర్ధారణకు కణితి నుంచి కొంత భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తీసి 'టిష్యూ బయాప్సీ' చేస్తారు. ఇది రోగికి కొంత బాధ కలిగించే ప్రక్రియ. దీనికి భిన్నంగా, లిక్విడ్ బయాప్సీ విధానంలో కేవలం ఒక రక్తపు చుక్కతోనే శరీరంలో వ్యాపించిన క్యాన్సర్ కణాల డీఎన్‌ఏను విశ్లేషించి వ్యాధి తీవ్రతను గుర్తిస్తారని నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ వివరించారు. దీనివల్ల రోగికి ఎలాంటి కోత, శస్త్రచికిత్స అవసరం ఉండదు.ఇప్పటికే నిమ్స్‌లోని క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్‌లో 'నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్' (ఎన్‌జీఎస్) టెక్నాలజీతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ 'డైమండ్ ప్రాజెక్టు'లో భాగంగా ఈ సేవలను ప్రారంభించారు. క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన మార్పులను గుర్తించి, రోగి శరీరతత్వానికి అనుగుణంగా 'టార్గెటెడ్ థెరపీ' అందించడానికి ఈ పరీక్షలు కీలకం. 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 1,443 మంది రోగులకు ఈ ఖరీదైన జన్యు పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించి, వారికి మెరుగైన చికిత్స అందించినట్లు డాక్టర్ బీరప్ప తెలిపారు.కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఎన్‌జీఎస్, లిక్విడ్ బయాప్సీ వంటి అత్యంత ఆధునిక పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రిలో, అదీ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. ప్రభుత్వ మద్దతుతో నిమ్స్ అందిస్తున్న ఈ ప్రపంచస్థాయి వైద్య సేవలు, ఎందరో పేద, మధ్యతరగతి క్యాన్సర్ బాధితులకు పునర్జన్మను ప్రసాదించనున్నాయని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.